# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 21 డిసెంబర్ 2022


## కడప నుంచి స్టార్ లైనర్ బస్సులు

**- సాంక్రాంతికి ప్రత్యేకంగా 317 బస్సులు**



**కడప కార్పొరేషన్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

కడప డిపో నుంచి విజయవాడ, హైదరాబాదుకు ఎమ్మిగనూరు నుంచి బెంగళూరుకు నూతనంగా స్టార్ లైనర్ బస్సులను ప్రవేశపెట్టామని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప జోన్ నుంచి అరుణాచలానికి ప్రతి పౌర్ణమికి బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ధనుర్మాసంలో వైష్ణవ క్షేత్రాలకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. పులివెందుల డిపో నుంచి హైదరాబాదుకు డాల్ఫిన్ క్రూయిజర్ బస్సు వెళ్తున్నాయని వివరించారు. సంక్రాంతి ప్రయాణికులు హైదరాబాదు నుంచి ఊర్లకు పోయేందుకు కడప జోన్ నుంచి 317 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వెల్లూరునుంచి హైదరాబాదుకు ఇంద్ర బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎస్పీ శ్రీధర్

**రామాపురం.డిసెంబర్ 20 ప్రభాతవార్త**



పోలీస్ స్టేషన్‌ను మంగళవారం రాత్రి అన్నమయ్య జిల్లా డిఎస్పీ శ్రీధర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పెండింగ్ సంబందించిన కేసులను పరిశీలించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహదారులకు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రమాదాలు జరిగే చోట సిసి కేమెరాలు ఏర్పాట చేయాలని అన్నారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వరప్రసాద్, కానిస్టేబుల్స్, హోం గార్డులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్ళిన మహిళ

**ఏజెంటు మోసంతో తిరిగి ఇండియాకు**
**పాస్‌పోర్ట్‌లో నకిలీ స్టాంపింగ్**
**తండ్రి మరణంతో కుటుంబం ఇక్కట్లు**
**ఉన్న డబ్బు గల్ఫ్ కోసం ఖర్చు**
**రోడ్డునపడ్డ కుటుంబం**
**ఆదుకోవాలంటూ వినతి**



ఆవేదన వ్యక్తం చేస్తున్న సుభాన్ బీ, తల్లి పీరాంబి.

**బద్వేలు, డిసెంబరు 20 ప్రభాతవార్త :**

కుటుంబంలో తల్లి, తండ్రి వయసు పైబడ్డాక పిల్లలను పోషించడం కష్టతరమైన తరుణంలో ఆ ఇంటికి తానే పెద్ద దిక్కు అని, చెల్లెళ్లకు, తల్లిదండ్రులకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో అప్పులు చేసి గల్ఫ్ దేశానికి వెళ్ళారు. అనుకోని పరిణామం. ఏజెంటు చేసిన మోసంతో ఇండియాకు తిరిగి రావడంతో ఆ కుటుంబం పరిస్థితి రోడ్డున పడినట్లయింది... వివరాల మేరకు అట్లూరు మునక ప్రాంతానికి చెందిన వారు బాకరాపేట సమీపంలోని కొత్త మలినేనిపట్నం వద్ద సిద్దయ్య, పీరాంబి అనే వారు నివాసం ఉంటున్నారు. వీరికి ఐదు మంది ఆడ పిల్లలు సంతానం. వీరిలో రెండవ కుమార్తె సుభాన్ బీ అనే మహిళ గల్ఫ్ దేశమైన కువైట్‌కు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండడమేగాక చిన్న వయసులో ఉన్న చెల్లెళ్ళకు పోషణతో పాటు వారి ఆలనా పాలనా చూడాలనే ఉద్దేశ్యంతో కువైట్ కు వెళ్ళాలని భావించి బద్వేలు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలో ఉన్న ఒక ట్రావెల్స్‌ను సంప్రదించారు. ట్రావెల్స్ వారు పాస్‌పోర్ట్ తీసుకొని కువైట్‌కు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లకు 95 వేల రూపాయలు నగదు తీసుకున్నారు. ఏప్రిల్‌లో మహిళను కువైట్‌కు పంపడం జరిగింది. కువైట్‌లోని షేట్ ఇంట్లో యజమానులు ఇబ్బందులకు గురి చేయడంతో బయటికి వచ్చేశారు. బయట పని చేసుకోవాలని ప్రయత్నిస్తుండగా అకామ తగలకపోవడంతో పనికి ఇబ్బందిగా మారి ఇండియాకు జూన్‌లో తిరిగి వచ్చింది. తరువాత మళ్ళీ కువైట్‌కు వెళ్ళేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ ప్రయత్నంలో పాస్‌పోర్ట్ ను బాంబే కౌన్సిలేట్‌కు పంపించగా పాస్‌పోర్ట్‌లో నకిలీ స్టాంప్ ఉండడంతో ఈ అమ్మాయిని కువైట్ కు పంపేందుకు అనుమతి లేదని ఏజెంటు తిరిగి పంపించారు. మొదటగా బద్వేలుకు చెందిన ఏజెంటు కువైట్‌కు పంపేటపుడు 95 వేల రూపాయలు నగదు తీసుకొని ఇమ్మిగ్రేషన్, పిసిసి, మెడికల్, ఫ్లైట్ టికెట్‌తో పంపే ప్రయత్నం చేసినప్పటికీ వీటిలో ఇమ్మిగ్రేషన్, పిసిసి చేయకుండా దొంగ దారిన కేరళలోని కొచ్చి ద్వారా పంపించారు. అనంతరం అక్కడ జరిగిన పరిణామాలతో తిరిగి వచ్చింది. ముఖ్యంగా పాస్‌పోర్ట్‌లో వేసిన స్టాంప్ నకిలీ స్టాంప్ అని పూర్తిగా తెలిపోయింది. ఈ సీల్ వేయడం వల్ల పాస్ట్‌పోర్టే చెల్లదని ఏజెంట్లు, కొంత మంది అధికారులు నిర్ధారించారు. దీంతో సుభాన్‌బీ పోలీసులను ఆశ్రయించింది. కానీ ఈ విషయం తెలిసిన అప్పటికే వారి తండ్రి సిద్దయ్య మరణించారు. దీంతో కుటుంబం మొత్తం రోడ్డున పడింది. దిక్కు తెలియని స్థితిలో ఎవరికి చెప్పుకోవాలో తెలియక, ఏజంటు చేసిన మోసాన్ని గుర్తించలేక సుభాన్ బీ చివరకు పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫలితం లేక



పాస్‌పోర్ట్‌లో నకిలీ స్టాంప్ వేసిన ఏజెంటు

పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. సుభాన్‌బీని కువైట్‌కు పంపేందుకు తల్లిదండ్రులు అప్పులు చేసి దాదాపుగా 2 లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పంపినప్పటికీ సుభాన్‌బీ వల్ల కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని అనుకున్నప్పటికీ పరిస్థితి తారుమారు కావడంతో చివరకు రోడ్డున పడ్డారు. ఏజెంటు మోసం పక్కాగా ఉందని పోలీసులు కూడా తేల్చి చెప్పారు. పాస్‌పోర్ట్‌లో నకిలీ స్టాంప్ పడిందని పోలీసుల వద్ద వారు కూడా ఒప్పుకున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఒక కుటుంబం ఏజెంటు మోసానికి బలై రోడ్డున పడింది. చిన్న పిల్లలను చూస్తూ తల్లి ఇబ్బంది పడడమేగాక కువైట్ నుండి తిరిగి వచ్చిన కుమార్తె సుభాన్‌బీని చూస్తూ ఆమె కోసం చేసిన అప్పులు వెంటపడుతూ ఏమీ దిక్కుతోచక అయోమయ పరిస్థితిలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధిత మహిళ సుభాన్ బీ కి న్యాయం చేయాలని తల్లి పీరాంబీ కోరుతున్నారు.

# పేరొకరిది షాపు మరొకరిది

**-మెడికల్ దుకాణాల మాయాజాలం**



**రాయచోటి.డిసెంబర్ 20 ప్రభాతవార్త**

రాయచోటి పట్టణంలో చాలా దుకాణాలు పేరొకరిది షాపు మరొకరిది మెడికల్ మాయాజాలం నడుస్తోంది. ప్రిస్కిప్షన్ లేకున్నా పర్వాలేదు. డాక్టర్ సిఫార్సు జాంతానై వారు చెప్పింది వేదం చేసేది శాసనం ఆ మందు ఈ మందు అనే తేడా లేదు. ఇక్కడ అన్ని మందులు అమ్మబడును. బ్రాండెడ్ పేరిట నకిలీ మందులు రాజ్యమేలుతున్నాయి. ఎమ్మార్పి వర్తించదు. రసీదులు ఇవ్వరు. ఇది మెడికల్ మాయాజాలం. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నా ఔషద నియంత్రణ శాఖ పట్టించుకోదు. మూడు నెలలకొసారి మామూళ్ల ముడుతున్నాయి కాబోలు. దీంతో మెడికల్ షాపుల వైపు కన్నెత్తి చూస్తున్న దాఖలాలు లేవు. డాక్టరే తమ సొంత ఆస్పత్రులలో మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకుని వారికి ఫిజిషియన్ శాంపిల్స్‌ను షాపులు ద్వారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే మెడికల్ షాప్ ఏర్పాటు చేయడంతో పాటు కిరాణా షాపులు మాదిరిగా జనరల్ సామాగ్రి కూడి విక్రయిస్తున్నారు. కాదేది కల్తీకి అనర్హం అన్నట్లుగా ప్రస్తుతం అంతా కల్తీమయం అయిపోయింది. తయారీదారులు వినియోగదారుల ఆరోగ్యాన్ని విస్మరించి కల్తీలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఫేక్ మందుల తయారీ బిజినెస్ చాపకింద నీరులా విస్తరించి ప్రస్తుత పరిస్తితులలో అసలు మందు లేవి నకిలీ మందులేవో గుర్తించడం సవాల్‌గా మారింది. దీంతో ప్రజలను నకిలీ మందులు బారి నుంచి కాపాడేందుకు ఇటీవల కేంద్ర ప్రభత్వం ఒక కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. మెడికల్ షాపుల్లో నకిలీ మందులను గుర్తించేందుకు క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ విధానం వల్ల సులభంగా నకిలీ మందులేవో అసలు మందులేవో గుర్తించవచ్చు.

**పేరు ఒకరిది షాపు మరొకరిది...**

మెడికల్ షాపులు ఏర్పాటు చేయాలంటే ఫార్మసి సర్టిఫికేట్ అవసరం ఉంటుంది. ఆ సర్టిఫికేట్‌లు ఆధారంగానే అధికారులు లైసెన్స్ జారీ చేస్తారు. వైద్యం వ్యాపారంగా మారిని క్రమంలో కొంతమంది పార్మసి చేసి ఉన్నత చదువులు చదివే వారికి సంబందించి ఫార్మసి సర్టిఫికేట్‌లను తీసుకుని లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్టిఫికేట్‌లో ఉన్న పేరుతోనే లైసెన్స్ మంజూరు అవుతుంది. సదరు ఫార్మసిస్ట్ షాపులో తప్పనిసరిగా ఉండి మందులు విక్రయించాల్సి ఉంటుంది. అయితే చాలా చోట్ల అవగాహన కూడా లేనివారితో మందులు విక్రియిస్తున్నారు.

**మెడికల్ దుకాణాలపై కేంద్రం కొరడా....**

తొలిదశలో ఎక్కువగా వాడకంలో ఉండే 300 రకాల మందులను బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్ మందులు ప్రైమరీ ప్యాకేజింగ్ లేబుల్ ఉంచనున్నారు. ఈ దశలో యాంటిబయోటిక్స్ కార్డియాక్సిస్ అలర్జీ మెడిసెన్స్‌పై కూడా రూపాయి కంటే ఎక్కువ ఖరీదు చేసి స్క్రిప్ట్‌పై ఈ క్యూఆర్‌కోడ్ ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వెబ్‌సైట్‌కి వెళ్తుంది. ఆ డ్రగ్‌కు సంబందించి సమాచారం కనిపిస్తుంది. ఆ మందు తయారైన తేదీ పూర్తయ్యే తేదీ తయారయిన లైసెన్స్ నంబర్ కనిపిస్తాయి. మొదటి విడుతలో 300 రకాల మందులపై బార్‌కోడ్‌ను ప్రైమరీ ప్యాకేజీంగ్‌లో ప్రింట్ చేయనున్నారు. ఈ విధానంపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నప్పటికి అమలులోకి రావడానికి కొంత సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

**చీటి లేకున్నా ....**

రోగులకు డాక్టర్లు రాసిచ్చే ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపుల్లో మందులు ఇవ్వాల్సి ఉంది. ఎలాంటి చీటి లేకున్నా ఏ మందు అడిగితే ఆ మందు ఇస్తున్నారు. ఇచ్చే మందులకు ఎలాంటి బిల్లులు ఇవ్వడం లేదు. ఒక వేళ ఆ మందులు వాడిన రోగులకు వికటిస్తే తాము అమ్మలేదని బుకాయించిన సంఘటనలు అనేకమున్నాయి.

**షెడ్యూల్ హెచ్‌పై నియంత్రణ ఏది...**

మెడికల్ షాపులకు సరఫరా అయ్యే మందులలో కొన్ని ముఖ్యమైన మందులు షెడ్యూల్ హెచ్ హెచ్చరికలతో సరఫరా అవుతాయి. అలాంటి మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి. ఈ మేరకు రిజిస్టర్ మెయింటెన్స్ చేస్తూ కొనుగోలు చేసిన మందులు విక్రయించిన మందులను ప్రతిరోజు రిజిస్ట్రార్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రత్యేక మెయింటెనెన్స్ చేయడం లేదు. కొన్ని మెడికల్ షాపులలో రాత్రి షాపు మూసే ముందు కొన్ని మందులను సంబందించి బిల్లులు కట్ చేస్తూ నిబందనలు నుంచి తప్పించుకుంటున్నారు.

# దళితుల పేరుతో దగా...!

**ఎస్సి సబ్‌ప్లాన్ నిధుల కోసం తప్పుడు నివేదికలు - సిఎంఒకు ఫిర్యాదుతో వెలుగులోకి**
**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రంగంలోకి- తహశిల్దారు నివేదికతో వాస్తవాలు వెలుగులోకి...**
**4 కోట్ల నిధుల కోసం అడ్డదారులు- ఓబులవారిపల్లె, పుల్లంపేటలో వెలుగు చూసిన జలవనరులశాఖ పనులు.**

**రాజంపేట అర్బన్, డిసెంబరు 20 ప్రభాతవార్త**

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు ఇద్దరు కాంట్రాక్టర్‌లు దళితుల అభ్యున్నతికి కేటాయించే నిధుల కోసం అడ్డదారులు తొక్కారు. ఎస్సి సబ్‌ప్లాన్ కోసం దళితులు లేని ప్రాంతాల్లో దళితులు ఉన్నట్లు రికార్డులు సృష్టించారు. సాక్షాత్తు సిఎంఒనే బురిడీ కొట్టించారు. కాదంటే రొట్టె ముక్క కోసం పిల్లులు కొట్లాడుకొన్న చందాన పనుల కోసం పోటీపడిన నేతల మధ్య విభేదాలు రావడంతో అసలు విషయం బయట పడింది. సాక్షాత్తు ముఖ్యమంత్రికి ఫిర్యాదులు వెల్లడంతో అవినీతి వ్యవహారం బయట పడింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో పాటు క్వాలిటి కంట్రోల్ విభాగం కూడ రంగంలోకి దిగడం ఇంతలోపే రెవెన్యూ అధికారులు అసలు పనులు చేపట్టిన ప్రాంతాల్లో దళితులు 10 శాతం కూడ లేరని నివేదిక పంపడంతో బోగస్ వ్యవహారం బయట పడింది. వివరాల్లోకి వెళితే వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలకు చెందిన ఇద్దరు నేతలు, కాంట్రాక్టర్‌లు ఇదివరకే చేసిన పనులు, లేని కుంటల పేరుతో పనులు చేసేందుకు పన్నాగం పన్నారు. రెవెన్యూ, జలవనరులశాఖ రికార్డుల్లోనే లేని కుంటలపై చెక్‌డ్యాంలు నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. ఉన్నత స్థాయిలో తమకున్న పలుకుబడితో ప్రజాప్రతినిధుల సిఫార్సుతో సిఎంఒ ద్వారా పనులు మంజూరు చేయించుకున్నారు. ఈ మేరకు 2020లో జలవనరులశాఖ ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పరిధిలోని పుల్లంపేట మండలం దళవాయిపల్లె గ్రామ సమీపంలోని తోట కాలువ ఆనకట్ట భూముల రక్షణపరులకు ఇదే గ్రామంలోని కొండమ్మచెరువు వద్ద గల మొరవ అంచులకు రక్షణ పనులు చేపట్టేందుకు కొత్తపల్లె అగ్రహారం సమీపంలోని పెద్దవంక వద్ద చెక్‌డ్యాంను పునర్నిర్మించేందుకు కేతరాజుపల్లె సమీపంలో గుర్రాలమడుగు సప్లైఛానల్ అంచులకు రక్షణ పనులు చేపట్టేందుకు దళవాయిపల్లె సమీపంలోని వైఎస్ఆర్ తోట వద్ద గల ఎర్రవంక సప్లై ఛానల్‌కు అడ్డంగా చెక్‌డ్యాంను పునర్నించేందుకు కొత్తపల్లె సమీపంలోని ఎర్రావారి పర్క్యులేషన్ ట్యాంకును పునరుద్ధరించేందుకు దళవాయిపల్లె ఆనకట్టను పునరుద్ధరించేందుకు దళవాయిపల్లె లోకల్ పర్క్యులేషన్ ట్యాంకును పునరుద్దరించేందుకు 1.26 కోట్లు నిధులు మంజూరు చేశారు. అలాగే ఓబులవారిపల్లె మండలం సంజీవనగర్ ఎస్సి కాలని సమీపంలోని లోకల్ కుంట పర్క్యులేషన్ ట్యాంకును పునరుద్ధరించేందుకు పున్నాటివారిపల్లె సమీపంలోని ఎర్రవంకకు అడ్డంగా చెక్‌డ్యాంను పునరుద్ధరించేందుకు జడ్‌హెచ్‌డిసి కాలని సమీపంలోని



ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల్లో చేపట్టిన చెక్‌డ్యామ్‌ల పనులు

జమ్ముకుంట పర్క్యులేషన్ ట్యాంకును పునరుద్ధరించేందుకు, పున్నేటివారిపల్లె అరుంధతివాడ వద్ద లోకల్ పర్క్యులేషన్ ట్యాంకును పునరుద్ధరించేందుకు జలవనరులశాఖ టెండర్లు పిలిచి పనులు చేపట్టింది. ఇదివరకే పనులు జరిగినచోటే మరలా నిధులు కేటాయించారు. దళితులు లేని దళవాయిపల్లె, అయ్యలరాజుపల్లె, కేతరాజుపల్లె, కొత్తపల్లె గ్రామాల్లో నిధులను కేటాయించారు. ఈ విషయంలో పెద్ద ఎత్తున నిధులు కాజేసేందుకు పన్నాగం పడినట్లు సిఎంకు ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో రైల్వేకోడూరులో డిఇగా పనిచేసిన అధికారితో పాటు మరో డిఇ, జెఇపై ఫిర్యాదులు చేశారు. దీనిపై జలవనరులశాఖ ఎస్ఇకి విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంతేగాకుండా ఈ నిధులపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. అలాగే ఎస్సిల పేరుతో ఎస్సి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించడంపై అసలు మంజూరైన పనుల ప్రాంతంలో ఎస్సిలు 90 శాతం ఉన్నారా లేదా అన్న విషయమై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో ప్రస్తుత పుల్లంపేట తహశిల్దారు పి.నరసింహకుమార్, ఆర్‌డిఒ ఆదేశాల మేరకు కేతరాజుపల్లె, దళవాయిపల్లె, కొత్తపల్లె ప్రాంతాల్లో జలవనరుల శాఖ డిఇఇ చెంగల్‌రాయుడు పనుల మంజూరు కోసం పంపిన డాక్యుమెంట్లు బోగస్ అని పదిశాతం మాత్రమే దళితులు ఉన్నారని, మిగతా 90 శాతం ఒసిలు అని స్పష్టం చేస్తూ (రెఫరెన్స్ నంబరు ఎ/199/2022 తేది 21.11.2022) నివేదికను పంపారు. దీంతో ఈ పనులను చేపట్టేందుకు సిఫార్సు చేసిన జలవనరుశాఖ అధికారులపై జిల్లా కలెక్టర్ గిరీషా ఎలాంటి చర్యలు తీసుకొంటారో వేచి చూడాల్సి ఉంది. ఇది కాకుండా మరిన్ని ఎస్సి సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయించుకొని నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నిరుద్యోగులను నిలువునా ముంచిన జగన్‌మోహన్‌రెడ్డి

**టీడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులురెడ్డి**

**రాయచోటి.డిసెంబర్ 20 ప్రభాతవార్త**

రాష్ట్రంలో నిరుద్యోగులను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసపూరిత మాటలతో నిలువునా ముంచారని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి ఆరోపించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మంగళవారం తెలుగుయువత రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు తొపిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి ఆయన హాజరయ్యి సంఘీభావం తెలిపి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని ఎన్నికల సమయంలో కల్లిబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి రాగానే మాటతప్పి మడమతిప్పారని ఎద్దేవ చేశారు. అధికారంలోకి వచ్చాక జాబ్‌లెస్ క్యాలెండర్‌తో నిరుద్యోగులని నిలువునా మోసం చేశారన్నారు. 1994-2004 మద్య మరియు 2014-19 మద్య చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 7 డిఎస్సీలు నిర్వహించి మొత్తం 1 లక్ష 70 వేల నియామకాలు భర్తీ చేయడమైనదని, ఇందులో రిజర్వేషన్ ద్వారా బిసి, ఎస్సీ, ఎస్టీ యువత భారీగా ఉద్యోగాలు పొందారన్నారు. కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి జగన్‌రెడ్డి, ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్నా కనీసం ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేదన్నారు. 50వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. డిఎస్సీ నిర్వహించకపోవడం అంటే సామాజిక న్యాయం మంటగలపడమే. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆయా ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులకు వయసు పెరగడంతో వారు నిరాశతో కాలం వెళ్లబుచ్చే పరిస్థితి ఏర్పడింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని నిరుద్యోగులకు భరోసా కల్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**- నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్ రెడ్డి**



ర్యాలీలో మాట్లాడుతున్న టీడీపీ యువనేత రితీష్ రెడ్డి.

**బద్వేలు అర్బన్, డిసెంబరు 20 ప్రభాతవార్త :**

మూడున్నర సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని తక్షణం పరిష్కరించాలని బద్వేలు నియోజకవర్గ టీడీపి యువనేత రితీష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీలోని 4వ వార్డు హరిజనవాడలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం టీడీపీ యువనేత రితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు వైకాపా నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి ఒక అవకాశం ఇచ్చారని, కానీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, నాగరాజుపల్లె మస్తాన్ బాబు, జయరాం నాయుడు, చెవుల కృష్ణమూర్తి, కొలవలి వేణుగోపాల్, మిత్తికాయల రమణ, అనిల్, అలంఫీర్, మాజీ కౌన్సిలర్ అబ్రహాంతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలపై యువతకు అవగాహన : డిఎస్పి



**కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :**

మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా నిరోదించేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మదన పల్లె డిఎస్పి కే.కేశప్ప అన్నారు. మంగళవారం మిట్స్ కళాశాలలో ముది వేడు పోలీస్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిఎస్పి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యా లకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో మత్తుపదార్థాల నిరోధంపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల్లో చైతన్యం తెచ్చి మత్తు పదార్థాలాకు అడ్డుకట్ట వేయాలని ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆయన కోరారు. యువత మారకద్రవ్యాల వైపు మొగ్గు చూపకుండా మానసికంగా సిద్దం చేయడానికి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ కళాశాల తరపన డ్రగ్స్ నిర్మూళనకు అన్ని కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, నాదేండ్ల ద్వారకనాథ్, రూరల్ సిఐ శివాంజనేయులు, ముదివేడు ఎస్ఐ సుకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా కోర్టు ఉద్యోగుల రాత పరీక్షలు

**కడప లీగల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 21 నుంచి జనవరి 2 వరకు జరిగే వివిధ ఉద్యోగాల భర్తీకై ప్రవేశ పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత మధ్య పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోలమన్‌రాజు తెలిపారు స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా కోర్టులలో జూనియర్ అసిస్టెంట్లు, స్టెనో గ్రాఫర్లు, టైపిస్ట్‌లు, రికార్డు అసిస్టెంట్లు, ఎగ్జామినర్లు, కాపీయిస్టులు, డ్రైవర్లు, అటెండర్ల ఉద్యోగ భర్తీకై నిర్వహిస్తున్న పరీక్ష కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరిగాయన్నారు. పై ఉద్యోగాలకు ప్రవేశపరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్లలో ఉన్న నిబంధనలు తూచా తప్పకుండా ప్రతి అభ్యర్థి పాటించాలన్నారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా జరుగుతాయన్నారు. షెడ్యూలు ప్రకారం ప్రవేశ కేంద్రాల్లోకి 15 నిమిషాలు ముందే చేరుకోవాలన్నారు. అలా హాజరు కాని వారిని లోనికి అనుమతించరని ఆయన తెలిపారు. హాల్‌టికెట్ల వెరిఫికేషన్‌లో ఒరిజినల్స్ తీసుకురావాలని సూచించారు. ప్రతి అభ్యర్థి 3 పాస్‌పోర్టు సైజుఫొటోలపై గజిటెడ్ ఆఫీసర్ అటెస్టేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉండవన్నారు. కొన్ని ఉద్యోగాలకు మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని వారికి సమాచారం ముందుగా అందిస్తామన్నారు. పై పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రవేశ కేంద్రాల్లోకి మొబైల్,



క్యాలుకులేటర్, ఐప్యాడ్, బ్లూటూత్ తదితర ఎలక్ట్రికల్ పరికరాలు అనుమతించరని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్దకు హాజరయ్యే అభ్యర్తులు ప్రయాణ ఖర్చులు స్వతహాగా భరించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు సమయానికి అభ్యర్థులు తీసుకొచ్చేందుకు ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు తిరిగి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులకు ఏవైనా అసౌకర్యాలు కలిగితే హెల్ప్ డెస్క్‌ను ఆశ్రయించి సహాయం పొందవచ్చన్నారు. అభ్యర్థులు దళారుల మాట నమ్మి మోసపోవద్దని ఈ పరీక్షలు పూర్తిగా మెరిట్ ఆధారితంగా ఉద్యోగ భద్రత జరుగుతుందన్నారు. అలా ఎవరైనా ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

## రాజగోపుర నిర్మాణ పనులను పరిశీలించిన కమీషనరు



**పులివెందుల రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త :**

పులివెందులలోని పలు ఆలయాల్లో నూతన రాజగోపుర నిర్మాణ పనులను మంగళవారం ఎండోమెంట్ కమీషనరు శంకరబాలాజి పరిశీలించారు. ఇందులో భాగంగా పులివెందులలోని అంకాలమ్మ దేవస్థానం వద్ద రూ.56లక్షలు, మిట్టమల్లేశ్వర దేవస్థానం వద్ద రూ.80లక్షల వ్యయంతో

(మిగతా IIవ పేజీలో)

## మహా ప్రసాద వినియోగంతో ముగిసిన ఆరాధన ఉత్సవాలు

**బ్రహ్మంగారి మఠం, డిసెంబరు 20 ప్రభాతవార్త**

భూత, భవిష్యత్తు, వర్తమాన కాలజ్ఞాన రచనలతో జనులను జాగృతపరిచిన జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దివ్యానుగ్రహంతో జన్మించిన పరమేశ్వరీ శ్రీ స్వరూపిణి శ్రీ ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు 20వ తేది మంగళవారం మహా ప్రసాద వినియోగంతో వైభవంగా ముగిశాయి. ఈ నెల 15 నుండి ప్రారంభమైన ఆరాధన ఉత్సవాలు మంగళవారంతో ముగిసినట్లు దేవాదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి డి.వి.జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పుష్ప రథోత్సవంలో భాగంగా విశ్వ బ్రాహ్మణ మహిళలు ఈశ్వరీ దేవి మఠాధిపతి శ్రీ వీర శివ కుమార స్వామి దంపతులను సన్మానించడం జరిగినది. వారం రోజుల పాటు వివిధ రకాల ఆధ్యాత్మిక కార్యక్ర మాలతో పాటు రకరకాల అమ్మవారి ఉత్సవాలు, అలంకరణలు, సాంస్కృతిక కార్యక్ర మాలు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతులు శ్రీ వీర శివకుమార స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ ఆరాధన ఉత్సవాలకు శాసన సభ్యులు శెట్టిపల్లి రఘు రామిరెడ్డి, మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జ్ పుట్టా సుధా కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్రెడ్డి తులసిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదన్ ఆచారి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ జేఏసి ఛైర్మెన్ హనుమంతరావుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగినది.





## ప్రతిభను వెలికి తీయడమే సైన్స్‌ఫేర్

జమ్మలమడుగు, డిసెంబరు 20, ప్రభాతవార్త:



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సైన్స్ ఫేర్‌ను నిర్వహించడం జరుగుతుం దని బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో మొబైల్ కమ్యూనికేషన్‌పై సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో మా పాఠశాలలో టింకరింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు ఏయడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో మేధాశక్తిని అధికంగా ఉందని వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారు సైంటిస్టులుగా తయారవు తారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సూర్యమిత్ర, ఏవో ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యా యులు షబానా, తస్లీమా, ప్రసాద్, సీనియర్ ఉపాధ్యాయులు భరత్, ఖాసీం, హృషి, బాషా, హేమలత విద్యార్థులను అభినందించారు.

## సైబర్ నేరాలపట్ల అప్రత్తత అవసరం : ఎస్ఐ

పెద్దమండ్యం డిసెంబర్ 20 ప్రభాతవార్త

పెద్దమండ్యం నివాసిని అంటూ కొందరు సైబర్ నేరాలకు పాల్పడు తున్నారు నమ్మిమోస పోకండనిఎస్ఐ వెంకటేష్ అన్నారు. 55ఇంచీల సోనీటీవి, డబుల్ బ్యాటరీ ఇన్వర్ట్ర్ కలిపి రూ.18వేలకు అమ్ముతున్నారని మాది పెద్ద మండ్యం ప్రక్కన కుంటకిందపల్లె, ముసలికుంట అంటూ నేను మీకు బాగా తెలుసు మీదగ్గర వస్తువులు కొన్నానని నమ్మిస్తారు. డబ్బులు అకౌంట్‌కు ట్రాన్స్ఫర్ చేయాలని అంటారు. వస్తువులు నేను తీసుకుని ఆటోలో పెట్టుకున్నానని, డబ్బులు అకౌంట్‌కు పడగానే చేరుస్తానని చెపుతారు వీరిమాటలను నమ్మకూడదనిఎస్‌వేంకటేష్ హెచ్చరిస్తున్నారు. వీరుసైబర్ నేరాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తారు. వీరు డబ్బు అకౌంట్‌లో పడగానే స్విచ్ఆఫ్ చేస్తారు. వీరిఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎవ్వరిమాటలు వినకూడదని అన్నారు.

## సేవా కార్యక్రమాలతోనే నిజమైన శుభాకాంక్షలు

వాల్మీకిపురం, డిసెంబరు 20 ప్రభాతవార్తః

పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపొందించాల్సిన అవసరం, బాధ్యత ఉందని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి ఎమ్మెల్యే నీరు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన రోజులు, పెళ్లిరోజులకు కేకులు కట్‌చేయడం లాంటి కార్యక్రమాలను దూరం పెట్టి మొక్కలు నాటడం వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకోవడం ఆకలిగా ఉన్న నిరుపేదలకు అన్నం పెట్టడం, అవయవ దానాలతో పాటు రక్త దానాలు చేయడం అలవర్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. మన అభిమాన నాయకులకు సేవా కార్యక్రమాలతోనే నిజమైన శుభాకాంక్షలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచి కేశవ రెడ్డి, నీళ్ల భాస్కర్, శ్రీధర్‌రాయల్, మైనారిటీ నాయకులు ఖలీమ్, మాజీ సర్పంచి సురేష్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## వ్యాధినిరోధక టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

వాల్మీకిపురం, డిసెంబరు 20ప్రభాతవార్తః



వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చినప్పుడే పిల్లలకు వ్యాధుల నుంచి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని డబ్ల్యూ హెచ్ఓ అన్నమయ్య జిల్లా ఎక్స్టర్నల్ అధికారి డాక్టర్ వాసీం అక్రమ్ అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీతో పాటు చింతపర్తి, మంచూరు, గండబోయినపల్లె, తాటిగుంట పల్లె గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ ంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం వైద్యసిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు ఏ సమయంలో టీకాలు ఇవ్వాలి, వ్యాధుల నుంచి రక్షణ తదితర అంశాలపై వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. కింది స్థాయి సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు టీకాలు వినియోగంపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి మానస, శ్రీవిద్య, సీహెచ్ఓ ఇందిరా రాణి, సూపర్‌వైజర్లు పూర్ణమ్మ, సుధాకర్, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండు

పీలేరు, డిసెంబరు 20 ప్రభాతవార్తః



స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఎమ్ఎస్‌పీ ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో మందకృష్ణమాదిగా ఆదేశాలు మేరకు మహా దీక్షలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతాకాల పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, ఎస్సీ వర్గీకరణ చేయ కుంటే బీజేపీకి పతనం తప్పదని హెచ్చరించారు. 100 రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తానని బీజేపీ మాట నిలబెట్టుకోవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 8 సంవత్సరాలు కావస్తున్నా వర్గీకరణ మీద జాప్యం చేస్తోంది. రేపటి నుంచి జిల్లా కేంద్రంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ నందు దీక్షలు కొనసాగిస్తామని మాట్లాడుతూ ఈదీక్షకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్ఎస్‌పీ రాష్ట్ర నాయకులు నవీన్‌కుమార్ మాదిగ, ప్రేమ్‌కుమార్ మాదిగ, యర్రయ్యమాదిగ, ప్రసాద్, కుమార్, కిన్నెర, తిమ్మయ్య, శ్రీనివాసులు, సిద్ధయ్య, రెడ్డెప్ప, వెంకటరమణ, నాగరాజ, పెరుమాళ్ మాదిగ, చక్రి మాదిగ, గణేష్ మాదిగ, గుర్రప్ప మాదిగ, ఆనంద్, దేవేంద్ర, పీలేరు మండల నాయకులు హరీష్, కుమార్‌మాదిగ, రెడ్డికిరణ్ మాదిగ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు అందరి బాధ్యత : ఏఈ

పీలేరు, డిసెంబరు 20 ప్రభాతవార్తః



ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ అదికారులు, ఉద్యోగులు కార్మికులు విద్యార్తులతో కలిసి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేశారు. ఇంధన పొదుపుపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా పీలేరు సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిగూటివ్ ఇంజినీర్(ఆపరేషన్) ఎస్.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఇంధన పొదుపు చేయకుంటే భావితరాలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సోలార్ వినియోగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ పట్న అసిస్టెంట్ ఇంజినర్ వెంకట పురుషోత్తం, గ్రామీణ అసిస్టెంట్ ఇంజినీర్ రామ్మూర్తి, శ్రీనివాసకుమార్, రవి కుమార్, లాజర్, విద్యుత్‌శాఖ సిబ ంది కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శక్తి వనరులను పరిమితంగా వినియోగించుకోవాలి

కేవి.పల్లె, డిసెంబరు 20 ప్రభాతవార్తః



శక్తి వనరులను ప్రజలు పరిమితంగా వినియోగించుకోవాలని స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రెడ్డి ప్రదీప్ అన్నారు. మంగళవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులతో శక్తి వనరుల వినియోగించ డంపై కేవి.పల్లెలో ర్యాలీ నిర్వ హించి ప్రజలకు అవగాహన కల్పించి నినాదాలు చేశారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ సుధాకర , బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారతీయ అంబేద్కర్ సేన 10వ వార్షికోత్సవ దినోత్సవం

పీలేరు, డిసెంబరు 20 ప్రభాతవార్తః



భారతీయ అంబేద్కర్ సేన 10వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ అంబేద్కర్‌సేన నాయకులు నేడు లక్ష్మీ వద్ధాశ్రమంలో కేకు కట్‌చేసి వద్దులకు అన్నదానం చేశారు. అనంతరం బాస్ నాయకులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుట విషయంలో, ఎస్సీ ఎస్టీలు ఆర్థికంగా ఎదగడానికి బ్యాంకర్లతో పోరాడి ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ లోన్లు మంజూరు చేయించామని ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగితే బాధితులకు రక్షణ కల్పించి వారికి అండగా నిలబడి పలు అట్రాసిటీ కేసుల నమోదు చేయించామన్నారు. కరోనా సమయంలో బాస్ పలు సేవా కార్యక్రమాలు చేసి బాధిత కుటుంబాలను ఆదుకుందన్నారు. కార్యక్రమంలో బాస్ సేన నాయకులు ముల్లం కష్ణయ్య, నాగరాజు, మల్లికార్జున, నాగేంద్ర, హరిబాబు, కేశవ పాల్గొన్నారు.

## ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ

ప్రొద్దుటూరు డిసెంబర్ 20, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లి శివప్రసాద్ రెడ్డి జన్మదినం సందర్భంగా 19వ వార్డు మాజీ కౌన్సిలర్ స్వర్గీయ ఉప్పులూరు మహమ్మద్ గౌస్ జ్ఞాపకార్థం సుమారు 500 పేద ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త కురాన్ గ్రంథంలో చెప్పిన విధంగా పేదలకు సహాయం చేసిన వారి ఆస్తులు విస్తరిస్తాయని పేర్కొన్నారు మానవతా విలువలతో ప్రతి ఒక్కరు జీవనం కొనసాగించాలని పేర్కొన్నారు ఈ సందర్భంగా మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ పేదలకు ఆర్థికంగా ఆదుకుంటూ దానధర్మాలతో ప్రజాభి మానాన్ని పొందిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లాంటి వారిని రాష్ట్రంలో చూడలేదన్నారు. ప్రొద్దుటూరుకు ఎమ్మెల్యేగా ఆయన ఉండడం ప్రజల అదృష్టం అన్నారు రాబోయే ఎన్నికలలో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు కార్యక్రమంలో ఉప్పులూరు గౌస్ పీరా టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షులు అక్రమ మహమ్మద్ గౌస్, 22వ వార్డు వైసిపి ఇన్చార్జి వై హిదాయత్ మరియు మైనారిటీ వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీధర్మశ్శాస్త అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:



లక్కిరెడ్డిపల్లె మండలంలోని గద్దగుండ్ల రాచపల్లి నామాల గుట్టపై నిర్మాణం లో ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, అటవీశాఖ స్టేట్ డైరెక్టర్ పూలు సఉబ్బారెడ్డి, టీడీపీ ఎల్‌పీసీ బోర్డు మెంబర్, వైసీపీ స్టేట్ సెక్రటరీ బసిరెడ్డి, సిద్దారెడ్డి, జిన్నా సేవా సమితి సంస్థ అధినేత షరీఫ్, శంకర్ ఆర్ట్స్ వైసీపీ యువ నాయకులు పవన్ కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి గుడి నిర్మించడం మంచి పరిణామ మన్నా రు. గుడి నిర్మాణం కోసం తమ వంతు కృషి చేస్తామని అయ్యప్ప స్వామి దేవ స్థానం ట్రస్ట్ శ్రీదర్మశాస్త్ర సేవా సమితి సభ్యులు గంగరాజు వెంకటేష్, నాగేంద్ర, సుధీర్, కె.గంగరాజుకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, గంగమ్మ ఆలయ ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, గురుస్వామి, సుబ్బయ్య స్వామి, శివశంకర్‌రెడ్డి, రాజా రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రాజారెడ్డి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:



తెదేపా హయాంలోనే గ్రామాల్లో తాగునీరు, రోడ్లు అన్నీ అభివృద్ధి చెందాయని మాజీ మార్కెట్ ఛైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం లక్కిరెడ్డిపల్లెలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ఇంటిం టి ప్రచారం చేసి వైసీపీ అరాచక అక్రమాల గురించి ప్రజలకు వివరిం చారు. నిత్యావసరం అయిన పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంట నూనె ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని పేదవాడు వైసీపీ ప్రభుత్వంలో బతకలేకున్నాడని ఆయన అన్నారు. నవరత్నాలు పేరుతో వైసీపీ కార్యకర్తలు దండుకున్నారని పేద ప్రజలకు నరకం చూపిస్తున్నారన్నారు. మంచి పరిపాలన కోసం చంద్రబాబునాయుడును సీఎం చేసి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు డాక్టర్ సెల్ ప్రదాన కార్యదర్శి షఫీనాయక్, సర్పంచులు లక్ష్మీనారాయణ, చంద్రాయుడు, గౌస్‌పీర్, జిలాన్‌బాషా, హరినాథ్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

## ఏపీ ఎస్ఆర్టీఎస్ వైకాపా కువైట్ కమిటీ సభ్యులసేవలు అభినందనీయం

కడప కార్పొరేషన్, డిసెంబరు 20, ప్రభాతవార్త:



జీవనోపాధి కోసం తెలుగు మహిళ పెంచలమ్మ కువైట్‌కు వెళ్లారు. అక్కడ ప్రమాదానికి గురై ఆమె చెయ్యి విరిగిపోయింది. కువైట్‌లో ఆదుకుఏ వారు లేక స్వదేశానికి రాలేక ఆమె ఇబ్బందులు ఎదుర్కొన్నదని ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ పేర్కొన్నారు. తిరిగి ఇండియాకు వెళ్లేందుకు సహాయం చేయాలని పెంచలమ్మ వేడుకోవడంతో స్పందించిన కువైట్ వైకాపా కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి మానవతా దృక్పథంతో భోజనంతో పాటుగా వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏపీఎన్ఆర్టీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ నాయని మహేష్‌రెడ్డి, వైసీపీ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, మణిలు పెంచలమ్మకు రూ.20వేలు వితరణ ఇచ్చినట్లు తెలిపారు. ఆమె క్షేమంగా ఇండియాకు చేరుకుందన్నారు. ఇందుకు సహకరించిన వారందరికి పెంచలమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

## సత్‌ప్రవర్తనతో జీవించాలి

కడప క్రైం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు మంగళవారం రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో గతంలో గ్యాంబ్లింగ్ కేసుల్లో ఉన్న వారికి సీఐ కె.రామ చంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ ప్రవర్తన కలిగి జీవించాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి (మణిరెడ్డి) (76) సోమవారం అర్థరాత్రి అకాలమృతి చెందిన విషయం తెలుసుకొని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తిరుపతికి వెళ్లి మణిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వైసీపీ పాలనలోనే అభివృద్ధి : మేయర్

కడప కార్పొరేషన్, డిసెంబరు 20, ప్రభాతవార్త:



మురికి కాలువలు, రోడ్లు నిర్మించి బేడ బుడగ జంగం కాలనీని అభివృద్ధి చేశారని బేడా బుడగ జంగం జిల్లా నాయకులు, వైసీపీ యువజన జిల్లా కార్య దర్శి పస్తం అంజి కొనియాడారు. మంగళవారం కడప అపూర్వ కల్యాణ మండపంలో మేయర్ సురేష్‌బాబును శాలువా కప్పి సన్మానించారు. ఈ సంద ర్భంగా అంజి మాట్లాడుతూ 48వ డివిజన్‌లోని బుడగ జంగం కాలనీలో డ్రైనేజీ, రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా నివాస గృహాల్లోకి ప్రవేశిస్తున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేకపోయిందని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జరుగుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, సీనియర్ నాయకులు మాసీమ బాబు, డైరెక్టర్ బంగారు నాగయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె.లక్షుమయ్య, డి.రాముడు, కె.కురువయ్య, శ్రీను, చిన్న వెంకటయ్య పాల్గొన్నారు.

## ఎర్రచందనం అక్రమాలను అడ్డుకడదాం..

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:



ఎర్రచందనం అక్రమాలను అందరం కలిసి అడ్డుకట్టాలని ఎస్సై వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలెం గొల్లపల్లె గ్రామంలో ఎర్రచందనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం మన దేశ సంపదను ఎవరైనా నరికి అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రతి ఒక్కరూ ఎర్రచందనం అక్రమాలను అడ్డుకోవాలి ఆయన సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తే వారిపై పీడీ చట్టం నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, పోలీసు సిబ్బంది, స్పెషల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వార్త కథనానికి కదిలిన రాష్ట్రఅధికారులు

### – బాలికను కస్తూర్బా పాఠశాలలో చేర్పించిన అధికారులు

ఓబులవారిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:




ప్రభుత్వ ఆశయం నీరు గారుతోందనే కథనానికి రాష్ట్ర ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె.దశరథరామిరెడ్డి, ఓఎస్‌సీ స్టేట్ కోఆర్డి నేటర్ పి.గీత అధికారులు మేకలు మేపుకుంటున్న బడిబయట పిల్లలను వారి తల్లిదండ్రులను కలిసి వారిని బడిలో ఎందుకు చేర్పించలేదని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్త స్పందనకు వందనం అంటూ తల్లిదండ్రులతో మాట్లాడు తూ పిల్లలను బాగా చదివించాలని వారికి హితవులు చెప్పి రాజీ అనే పెద్ద కూతురును ఓబులవారిపల్లె కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించినట్లు తెలిపారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ఆడ పిల్లలు విద్యకు నోచుకోక పశువుల కాపరులుగా మారడం సమాజానికి మంచిది కాదని నేటి పిల్లలే భావితరాల పౌరులని వారు పేర్కొన్నారు. మరో ఇద్దరు పిల్లలను కొత్తపల్లె దగ్గరలోని ప్రాథ మిక పాఠశాలలో చేర్పించాలని మండల స్థాయి కోఆర్డినేటర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా చదువుకోకుండా బాల కార్మికులుగా లేక స్తోమత లేని వారు సంబంధిత అధికారులను ఆశ్రయించి బాగా చదివించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలు విద్యాభ్యాసం కోసం ఖర్చు చేస్తూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని అందువల్ల ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులు కూడా బాగా చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెండ్లిమర్రి, డిసెంబరు 20, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప రూరల్ సర్కిల్ పరిధిలోని పెండ్లిమర్రి లోని రౌడీ షీటర్లకు మంగళవారం రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, పెండ్లిమర్రి ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్‌ప్రవర్తన కలిగి జీవించాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరు గారూ.. నా భూమి నాకు ఇప్పించండి

### – దళిత రైతు శివయ్య వినతి

ఓబులవారిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:

కలెక్టర్ గారూ.. నా భూమిని నాకు ఇప్పించండని ఓ పేద దళిత రైతు జిల్లా కలెక్టర్ గిరీషకు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వోకు వినతిపత్రం ద్వారా తమ సమస్యలను తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు మండలానికి చెందిన చెంగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ గడ్డమీద హరిజనవాడ గ్రామానికి చెందిన గానుగపెంట శివయ్య తండ్రి నరసింహులు సంబంధించిన సింగారెడ్డి గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 739/3లో ప్రభుత్వం డీకేటి పట్టా ఇచ్చింది. కొన్నాళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో భూమిని వ్యవసాయం చేసే స్తోమత లేక ఓబిలి గ్రామానికి చెందిన తిప్పన రామచంద్రయ్యకు కౌలుకు ఇచ్చాను. నా జీవనోపాధి కోసం నేను నా భార్య కువైట్ వెళ్లి అక్కడే 5 సంవత్సరాల పాటు ఉన్నాను. నా భూమిలో బోరు, మామిడి చెట్లు వేసుకొని వెళ్లాను. ఆ తరువాత నాకు కౌలు ఖర్చుల కింద ఆయన కొంత డబ్బులు ఇచ్చాడు. ప్రస్తుతం 1-బి ఆన్‌లైన్ కాగితం తీసుకొని నా భూమిని నాకు ఇచ్చి నా పేర ఆన్‌లైన్ చేయాలని ఈ పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నాను. నా భూమిని ఆక్రమించి నన్ను బెదిరిస్తున్నారు. కలెక్టరు దయ ఉంచి నాకు భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరుతున్నానని పేద దళిత రైతు వేడుకుంటున్నాను అన్నారు.

## రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారం

ఓబులవారిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:



మండలంలోని గొబ్బూరువారిపల్లెలో రెవెన్యూ పరమైన సమస్యలపై తహసీల్దారు పీర్‌మున్నీ గ్రామాన్ని సందర్శించారు. అన్ని విధాలా రెవెన్యూ సమస్యలు ఏవైనా తలెత్తినప్పుడు వాటి పరిష్కారానికి మార్గాలు చూడాలని గ్రామస్థులందరూ సమన్వయం పాటించి పరిష్కరించుకోవాలన్నారు. పునరావాస గ్రామానికి వాటి ఇంటి స్థలాలను పరిశీలించారు. ఈ సమస్యలు లేకుండా అర్హులందరికి ఇంటి స్థలాలు అందిస్తామన్నారు. గ్రామంలో గుడి, బడి, రోడ్లు, నీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లక్ష్మీనరసయ్య, మాజీ ఎంపీపీ తిరుపాల్, శంకరయ్య, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, ఆర్ఐ సదానంద, వీఆర్వోలు పాల్గొన్నారు.

## లోన్ యాప్‌ల మాయలో పడొద్దు : ఎస్ఐ

కడప క్రైం, డిసెంబరు 20, ప్రభాతవార్త:

లోన్ యాప్‌ల మాయలో పడి మానసిక వేదనకు గురి కావద్దని కొండాపురం ఎస్సై సత్యనారాయణ ప్రజలకు సూచించారు. కొండాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పు సులువుగా లభిస్తుందని ఫేక్ లోన్‌యాప్‌ల వలలో చిక్కుకోవద్దని వారు బ్లాక్‌మెయిల్ చేసి అధికంగా నగదు వసూలు చేసి ఇబ్బందులకు గురి చేస్తారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## నేడు జగనన్న కాలనీ ప్రారంభం

దువ్వూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త:



మండల పరిధిలోని గుడిపాడులో బుధవారం జగనన్నకాలనీని ప్రారంభిస్తున్నట్లు మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవోకార్యాలయంలో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా గుడిపాడులో జగనన్నకాలనీలో గృహ ప్రవేశాలను లబ్ధిదారులతో చేయిస్తున్నట్లు తెలిపారు. దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేటలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు జిల్లా నుంచి 7 మంది క్రీడాకారులు ఎంపిక

కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



కమలాపురం ఎస్ఆర్ఎం జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన 66వ ఇంటర్ జిల్లా త్రోబాల్ ఎంపికల్లో జిల్లా నుంచి 7 మంది క్రీడాకారులు జాతీయ జట్టులో స్థానం సాధించారు. బాలుర విభాగం నుంచి నలుగురు విద్యార్థులు, బాలికల విభాగం నుంచి ముగ్గురు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజ్ అన్నారు. ఎంపికైన అనిల్‌కుమార్, శివ నాగేంద్ర, ఆనంద్, విష్ణు చక్కటి ప్రతిభ కనబరిచి తమ స్థానాన్ని పదిలం చేసుకున్నారు. అలాగే బాలికల విభాగంలో స్పందన, వీరమోక్షిత, రాజరాజేశ్వరిలు జట్టులో స్థానం సాధించారు. కళాశాల డైరెక్టర్ రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జిలానీబాషా, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివశంకర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

## కోట్లాది రూపాయల ప్రజాధనం ఏటిపాలు

### – జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా

కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి రాకతో ఉన్నట్లుండి గుర్తొచ్చిన పాపాఘ్నిపై ఆఘమేఘాల మీద వేసిన పాపాఘ్ని అప్రోచ్ రోడ్డు 24 గంటల గడవక ముందే ఇలా నెర్రలు బారిపోవడం చూస్తుంటే ఈ రోడ్డు ఎంత నాణ్యతతో వేశారో అర్థమవుతోందని తెదేపా జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా అన్నారు. కేవలం ఒక రోజు సీఎం పర్యటన కోసమే ఈ రోడ్డు వేశారని, ప్రజల కోసం కాదని సీఎం వచ్చి వెళ్లేంత వరకు ఉంటే చాలన్నట్లు ఉందని తీవ్రంగా విమర్శించారు.

## పైడికాల్వ వాసు పార్థివ దేహానికి నివాళులు

కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



వల్లూరు మండలంలోని పైడికాల్వ గ్రామానికి చెందిన పుత్తా కుటుంబ విదేయుడు పైడికాల్వ వాసు మరణిం చడంతో ఆయన పార్థివ దేహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## రాజగోపుర నిర్మాణ పనులను పరిశీలించిన కమీషనరు

(మొదటి పేజీ తరువాయి)

రాజగోపుర నిర్మాణాలు చేస్తున్నారు. ఇంకా పలు ఆల యాల వద్ద చేస్తున్న పనులను కమీషనరు శంకరబాలాజి పరిశీలించారు. నాణ్యతతో గడువులోగా నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోలు రమణ, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు ప్రత్యేక జా గ్రత్తలు తీసుకోవాలి

రాయచోటి రూరల్ డిసెంబర్ 20ప్రభాతవార్త:

రోడ్డు నిబంధనలు పాటించడంతో పాటు రోడ్డు భద్రత ప్రమాదాలపై వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్థన్‌రాజు సూచించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు భద్రతపై వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించి జిల్లాలోని రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో 28, రాజంపేట సబ్ డివిజన్ పరిధిలో 23, మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో 9 చొప్పున మొత్తం 60 యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలను గుర్తించి అక్కడ ఎటువంటి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. వాహనాలను రహదారులపై ఎక్కడబడితే అక్కడ అక్కడ నిలబపకుండా కేవలం రెస్ట్ ఏరియాలో మాత్రమే వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జిల్లాలోని పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

## స్కూల్‌కు వెళ్లని టీచర్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు

పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 20ప్రభాతవార్త:



వైఎస్సార్ జిల్లాలోని అవధూత కాశినాయన మండలం, పోరుమామిళ్ళ మండలం. బి.కోడూరు మండలం, కలసపాడు మండలాలలోని కొంత మంది టీచర్లు స్కూల్‌కు వెళ్లకుండా బినామీలను ఏర్పాటు చేసి వారికి నెలకు రూ.3000 లేదా రూ.4000 ఇచ్చి చదువురాని వారిని ఏర్పాటు చేసి పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని కొంతమంది తల్లిదండ్రుల విద్యార్థులు మానవ హక్కుల పరిరక్షణ వారికి ఫిర్యాదు చేయడం జరిగిందని మానవ హక్కుల పరిరక్షణ ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వెంటనే అన్ని పాఠశాలలను తనిఖీ చేసి ఎవరయితే స్కూల్‌కు సరిగా వెళ్లని ఉపాధ్యాయులపైన చర్యలు తీసుకొనుటకు సిఫారసు చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ్ అధికారి తనిఖీ చేయకపోవడం వలన కొంత మంది టీచర్లు స్కూల్‌కు పోకపోవడం జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారరన్నారు. ఈ విషయంను జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## కవలకుంట్ల గ్రామ పంచాయతీలో గడప గడప కార్యక్రమం



పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 20ప్రభాతవార్త:

పోరుమామిళ్ళ మండలంలోని కవలకుంట్ల గ్రామ పంచాయతీ లోని కవలకుంట్ల హరిజనవాడ, దాసరిపల్లె, బుచ్చంపల్లె, వడ్డెపాలెంలో మం గళవారం గడప గడప కార్యక్రమంలో భాగంగా నవరత్నాలలోని సంక్షేమ పథకాలను ప్రజలకు శాసన సభ్యురాలు డాక్టర్ సుధ, రాష్ట్ర పంచాయతీ రాజ్ రూర ల్ డెవపల్‌మెంట్ ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జునరెడ్డిలు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమారి, గ్రామ సచివాలయం సిబ్బంది, ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐ నాగయ్య, పోలీసు సిబ్బంది, వాలంటరీలు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : ఎమ్మెల్యే

మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. మంగళవారం 24వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ముందుగా కేక్‌కట్ చేసి వార్డులో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణమంతా పచ్చదనంగా ఉండేలా ప్రతి వార్డులోనూ మొక్కలు విధిగా నాటాలన్నారు. నూతనంగా నిర్మించే భవనాల వద్ద మొక్కలు నాటేటప్పుడు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ ఛైర్మెన్ జింకా చలపతి, జడ్పిటిసి ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు రేణుకాలారా, ఎస్‌వి.రమణ, ఆర్‌వి.శివారెడ్డి, రామిశెట్టి శివయ్య, వైకాపా నాయకులు బాలగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కురవంకలో మొక్కలునాటిన సర్పంచ్

మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం పురష్కరించుకొని ముందస్తుగా మంగళవారం కురవంకలో గ్రామ సర్పంచ్ పసుపులేటి చలపతి, జడ్పిటిసి ఉదయ్‌కుమార్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలోని కురవంకలో ప్రతి ఇంటి ముందు మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామన్నారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టడం జరిగిందన్నారు. అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ సుశీల, ఉప సర్పంచ్, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## అఖిల భారత జాతీయ ఉపాధ్యక్షులుగా భాస్కరాచారి

మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



అఖిల భారత జాతీయ విశ్వ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులుగా డాక్టర్ అప్పినిపల్లి భాస్కరాచారి నియామకం అయ్యారు. కలకత్తాలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు అశ్వనికుమార్‌శర్మ చేతుల మీదుగా ఉపాధ్యక్ష నియామకపు పత్రాన్ని అందజేశారన్నారు. కార్యక్రమానికి మధ్యప్రదేశ్, జార్ఖాండ్, హిమాచల్‌ప్రదేశ్, కలకత్తా, ఒడిస్సాలతో పాటు 11 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. అఖిల భారతీయ విశ్వబ్రాహ్మణ సంఘం సహకారంతో పేదలుగా ఉన్న విశ్వ బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకొంటానన్నారు.

## హైదరాబాద్ ఆర్టీసి సర్వీసుల్లో ఆదాయం పెంచాలి

### డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి

మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

మదనపల్లె నుంచి హైదరాబాద్‌కు వెళ్ళే ఆర్టీసి సర్వీసుల్లో ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వన్‌డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం 2022 ఏడాదికి సంబంధించి జీఆర్‌ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా హైదరాబాద్ సర్వీసులన్నీ రూ.60వేల పైగా ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. రెండు రోజుల క్రితం డిపో పరిదిలో 45058 కిలోమీటర్లు బస్సులు తిరగగా రూ.18,79, 298లు ఆదాయం వచ్చిందన్నారు. రీజనల్ పరిధిలోని డిపో ఆదాయంలో మొదటస్థానం వచ్చిం దన్నారు. ఆదాయం పెంపుకు కృషి చేసిన ఉద్యోగులు కెడిఎన్.రెడ్డి, ఎస్‌జి.రెడ్డి, రాధాక్రిష్ణ, సూరిబాబు, ఎస్.నారాయణ, విఎం.షరీఫ్‌ను అభినందించారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లెక్రైం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని వివేకానంద నగర్‌కు చెందిన నరేష్ భార్య జి.స్వాతి(25) కుటుంబ కలహాలతో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితురాలిని 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా కండక్టర్ పర్సుచోరి

### బంగారు గొలుసు సామాగ్రి అపహరణ

మదనపల్లెక్రైం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

గుర్తు తెలియని దుండగులు మహిళా కండక్టర్ పర్సుచోరీ చేశారు. ఈ సంఘటన మంగళవారం పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. రెండవ పట్టణ పోలీసు కథనం మేరకు పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన సుబ్రమణ్యం భార్య రత్నమ్మ ఆర్టీసి వన్‌డిపోలో మహిళా కండక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నేపత్యంలో ఈనెల 14న సొంత పనులపై తిరుపతికి వెళ్ళారు. అక్కడ పనులు ముగించుకొని ఆర్టీసి బస్సులో మదనపల్లెకు బయలు దేరారు. బస్టాండుకు వచ్చి బ్యాగ్ ఒపెన్ చేసి చూడగా అందులోని పర్సు మాయమైంది. పర్సులో 30గ్రాముల బంగారు గొలుసు, ఏటిఎం, పాన్, హెల్త్, ఓటరు కార్డులు ఉన్నాయి. బాధితురాలు రెండవ పట్టణ పోలీసులకు, ఆర్టీసి అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్సు రద్దీగా ఉండడంతో గుర్తు తెలియని దుండగులు బ్యాగు తెరిచి పర్సును చోరీ చేశారని కండక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు గొలుసు విలువ రూ.1.20లక్షలు అవుతుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ మురళీక్రిష్ణ తెలిపారు.

## మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా శిక్షార్హులే : ఎస్ఐ

రామసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



రామసముద్రం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎస్ఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్మినా కొన్నా శిక్షార్హులేనని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని ఎవరైనా అలా బానిసలై ఉంటే కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. విద్యార్థులు ఎవరైనా మత్తుపదార్థాలు అమ్ముతూ పట్టుబడితే బాల నేరస్తుల కింద శిక్ష తప్పదన్నారు. ఈసమావేశంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగళ్ళులో 22న ఉరుసు

కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



కురబలకోట మండలం అంగళ్ళులో ఈనెల 22, 23వ తేదీలలో హజరత్ సయ్యాదినషేక్ అబ్దుల్‌ఖాదర్ జిలాని పిరాన్‌ఫీర్ గౌసుల్ ఆదామ్ దస్తగీర్ వారి 47వ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నదీసాబ్ సయ్యద్ రహంతుల్లా, సయ్యద్‌వల్లీలు తెలిపారు. ఈనెల 22న గురువారం రాత్రి గంధం, 23న శుక్రవారం రాత్రి ఉరుసు జరుగుతుందని దీనిని పురస్కరించుకొని ఖవ్వాలి పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పగలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దర్గావద్ద ఉరుసు ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దర్గాలో విద్యుత్ దీపాలంకరణ, స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్..

కడప క్రైం, డిసెంబరు 20, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గతంలో గ్యాంబ్లింగ్ కేసుల్లో ఉన్న వారికి మంగళవారం ఎస్సై సంజీవరాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్‌ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అంబరాన్నంటిన ముందస్తు క్రిస్మస్ వేడుకలు

కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని చర్చీలన్నీ పండగ కళను సంతరించుకున్నాయి. భక్తులంతా మంగళవారం సాయంత్రం నుంచే ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కమలాపురంలోని నిస్సీమైదాన మందిరంలో బ్రదర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు గనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ ట్రీ సాంటాక్లాస్, చిన్నపిల్లల కార్యక్రమాలు, స్వీట్లు పంపిణీ, క్రిస్మక్ కేక్ కటింగ్, నూతన సంవత్సర క్యాలెండర్, క్రిస్మస్ డిన్నర్ కార్యక్రమాలతో అలరించారు.

## జగన్ పాలనతో రాష్ట్రం అధోగతి:మాజీ ఎమ్మెల్యే

కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



జగన్ పాలనతో రాష్ట్రం అదోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి.శంకర్‌యాదవ్ ఆరోపించారు. మంగళవారం ముదివేడు గ్రామంలో ఇదేమిఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కచాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో భూదందాలు, మారక ద్రవ్యాలు, ఇసుక అక్రమరవాణాలు మితిమీరిపోయాయని ఆరోపించారు. అభివృద్ధి తిరోగమనంలో పయనిస్తోందన్నారు. చార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారాన్నినెట్టారని తెలిపారు. ప్రజావ్యతిరేక పాలనకు పాల్పడుతున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం లో దాదంవారిపల్లె సర్పంచ్ డిఆర్.అమరావతమ్మ, వెంకటరమణారెడ్డి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు అంగళ్ళులో ఉచిత గుండెవైద్యశిబిరం

కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త:

అంగళ్ళులో బుధవారం డిఎన్‌ఆర్ ఆసుపత్రి వద్ద ఉచిత గుండెవైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ప్రముఖ గుండెవైద్య నిపుణులు మంజునాథ్‌లు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని అవసరమైన వారికి వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కింద పరీక్షలు కొలార్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

## రాష్ట్రం బాగుపడాలంటే వైసిపిని ఓడించాలి

### టిడిపి ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



రాష్ట్రం బాగుపడి ప్రజలకు మేలు జరగాలంటే వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించాలని టిడిపి ప్రధానకార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మర్రికుంటపల్లె, మేడికుర్తి, మహల్ పంచాయతీలలో మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమంలో కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చినప్పటి నుంచి ఆరాచకాలు అధికమయ్యాయన్నారు. ప్రజలకు చేసింది శూన్యమని వైసిపి నాయకులు దందాలకు పాల్పడుతూ అక్రమాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వైసిపి అరాచకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి నాయకులు మోస పూరిత మాటలు నమ్మకుండా తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిరామ్, టిడిపి సీనియర్ నాయకులు ఎం.ఆనందరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్, రాజంపేట టిడిపి పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులు వాసునూరి చంద్రశేఖర్, మండల మాజీ జడ్పిటిసి మాలతి, మేడికుర్తి మాజీ ఎంపిటిసి జనార్ధన్‌గౌడ్, మండల టిడిపి రైతు అధ్యక్షులు సురేష్‌కుమార్‌రెడ్డి, మర్రికుంటపల్లె మాజీ సర్పంచ్ ఎం.గంగాధర్ దేవర్, టిడిపి నాయకులు భద్రయ్య, చిన్నరెడ్డయ్య, మండల టిడిపి తెలుగు యువత అధ్యక్షులు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, జగన్నపలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడిపూత సస్యరక్షణపై రైతులకు శిక్షణ

కలికిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



మండలంలోని మనొళ్ళపల్లె, టి.సంద్రవారిపల్లె పంచాయితీల్లో ఉద్యావనవన శాఖ ఆధ్వర్యంలో మామిడిపూత సమయంలో సస్యరక్షణ, మేలైన యాజమాన్య పద్దతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాయల్పాడు, కలికిరి, గుర్రంకొండ మండలాల క్లస్టర్ ఉద్యానవనశాఖ అధికారిణి లక్ష్మీప్రసన్న మామిడిపూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు విపలంగా వివరించారు. తేను మందుపురుగు తెగులుపైన బూడిద నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. శిక్షణా కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

## వనమహోత్సవ కార్యక్రమం విజయవంతం

కలికిరి, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జేఎన్‌టియు కళాశాలలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి మండల ఎంపిపి నూర్జహాన్ ముఖ్య అతిధిగా హాజరై కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఉన్నతాధికారులు మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పివి.స్యతనారాయణ అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## వైసిపిని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి వ్యక్తి సైనికుడవ్వాలి

### ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ, డిసెంబర్ 20, ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వాన్ని తిరిగి అధికారం లోకి తేవడానికి ప్రతి కార్యకర్తా సైనికుడి లా పని చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గోల్డెన్‌ప్లాజా కళ్యాణమండపంలో మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలవు తున్న పథకాలు యధావిధిగా కొనసాగాలంటే జగన్మో హన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజల్ని కోరారు. ప్రతిపక్షపార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిపివేస్తారని అన్నారు. ప్రస్తుతం అమలవు తున్న వాలంటీర్ వ్యవస్థ, సచివాలయాలను రద్దు చేస్తారని అన్నారు. సమావేశంలో నాయకులు శివానందరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు అప్పల్ల, మండల కన్వీనర్ ముక్తియార్‌అలీఖాన్, ఆర్‌బికె అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ఆర్‌బికె డైరెక్టర్ మురాషావలి, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, గోపాల్, చిన్నమస్తాన్‌రెడ్డి, జగన్మో హన్, అభిలాష్‌రెడ్డి, శివ, కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, నరశింహారెడ్డి పాల్గొన్నారు.

## రబీ పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

జమ్మలమడుగు, డిసెంబరు 20, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని రాజు గురువాయపల్లె, పెనికిలపాడు గ్రామాల్లో ఖరీఫ్, రబీలో సాగుచేసిన మినుము, పత్తి, శనగ పంటలను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహా దారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ పంటలో తీసుకోవాల్సిన మెళకువలను వివరించారు. ప్రతి పంటను ఈ క్రాప్ చేయించాలని సంబంధిత ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకట సుబ్బయ్య, మండల వ్యవసాయాధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు ముని రాజారెడ్డి, వైసీపీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివశంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణాలకు సిమెంటు, కడ్డీలు ఇవ్వాలి

కడప వైద్యవిభాగం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



జగనన్న కాలనీలోనే సిమెంటు కడ్డీలను ఇవ్వాలని రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీ దేవి, తస్లీంలు డిమాండ్ చేశారు. మంగళ వారం ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఇంటి నిర్మాణానికి అరకొరగా ఇస్తున్న డబ్బులు బాడుగలకే సరిపోయేలా ఉన్నాయని ఏ ప్రాంతంలో వారికి ఆ ప్రాంతంలో నుంచి సిమెంటు, కడ్డీలు, ఇసుకను పంపిణీ చేయాలని వారు కోరారు. నానాపల్లె లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఎక్కడో కేఎస్ ఆర్ఎం అవతల రేడియో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సిమెంటు కడ్డీలు పంపిణీ చేయడం ద్వారా అక్కడి నుంచి వాటిని తెచ్చుకునేందుకు బాడుగలకే సరిపో తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను గుర్తించి పేదలను అప్పుల ఊబి నుంచి కాపాడాలన్నారు. సంబంధిత అధికారులు దీనిపై స్పందించి ఆయా ప్రాంతాలలోనే ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కడప వైద్యవిభాగం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



కడప జిల్లాలోని విద్యుత్తు కార్మికులకు నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం మంగళవారం కడపలోని విద్యుత్తు భవన్‌లో ఎస్ఈని కలిసి వెళ్లారు. సీఎం రాక సందర్భంగా ఏర్పాటుకు సంబంధించి కార్యక్రమంలో ఎస్ఈ బిజీగా ఉండడంతో ఆఫీసులో మన సమస్యలపైన వినతి పత్రం ఇచ్చి ఎస్ఈకి ఫోన్‌లో చెప్పడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. జనవరి 9 లోపు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్‌బాబు, జిల్లా కమిటీ నాయకులు నాగరత్న ఆచారి, హరి, కేశవరెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను కాపాడిన పోలీసులు

### - అభినందించిన ఎస్పీ అన్బురాజన్

కడప క్రైం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



కడప నగరానికి చెందిన యశోధమ్మ (60) అనే మహిళ కుటుంబ సమస్య లతో విసిగి వేసారి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ఊటుకూరు సమీపంలోని రైల్వేఓవర్ బ్రిడ్జీ వద్దకు చేరుకుంది. మహిళ ఆవేదనతో పట్టాలపై వెళ్తుండ టం స్థానికులు గుర్తించి వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. ఊటుకూరు సమీపంలో విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ సిబ్బంది తక్షణం రంగంలోకి దిగి మహిళను గుర్తించి ఆమెను సురక్షి తంగా కడప తాలూకా పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసు కోవాలనుకున్న మహిళను వేగంగా స్పందించి కాపాడి మనోధైర్యాన్ని ఇచ్చిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఓబులేసు, హోంగార్డు సంతోష్ దీప్‌లను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించి నగదు రివార్డు ప్రకటించారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్

జమ్మలమడుగు, డిసెంబరు 20, ప్రభాతవార్త:



జమ్మలమడుగు పట్టణ మహాసభ మంగళవారం స్థానిక మూడు రోడ్ల నుంచి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు ర్యాలీ నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా వచ్చిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం మోటారు వాహన చట్టాన్ని తీసుకొచ్చి ఆటో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తక్షణం ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లైసెన్సు లేకపోతే రూ.5 వేలు విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు శివ నారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులు ప్రజా రవాణాలో కీలక భాగంగా ఉన్నారని అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు దాసరి విజయ్, కార్యదర్శి దాసు, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు మహబూబ్‌బాషా, ఆటో నాయకులు ప్రసాద్‌రెడ్డి, రాజు, అబ్రహాం, ఆదాం, నరేంద్ర, హుసేన్ వలీ, సుబహాన్, రవి పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు సాయం

జమ్మలమడుగు, డిసెంబరు 20, ప్రభాతవార్త:



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని వారి అభ్యున్నతికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని కొట్టాలపల్లి హైస్కూలు ఛైర్మన్ యత్తపు దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం కొట్టాలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు నుంచి 6 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నీస్‌కు ఎంపికై ఈనెల 21న విజయవాడ వెళ్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చింతకాల చౌడయ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు చౌడం పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చర్మవైద్య డాక్టర్‌గా బాబు రాజేంద్రప్రసాద్ నియామకం

మదనపల్లెక్రైం, డిసెంబర్ 20 ప్రభాతవార్త:



మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చర్మవైద్య నిపునిడిగా డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టా రు. చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆయన సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పదోన్నతి పొంది మదనపల్లెకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ హరికుమార్ పలమనేరు ఆసుపత్రికి బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ చర్మ సంబంధిత సమస్యలు ఉన్నవారు ఆసుపత్రికి వచ్చి చికిత్సలు చేయించుకోవాలన్నారు.

## విజయేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రొద్దుటూరు డిసెంబర్ 20, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి జన్మదినం సందర్భంగా బొందిలి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రసపుత్ర రజని ఆధ్వర్యంలో విజయేశ్వరి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు పాల్గొని వృద్ధుల దీవెనలు అందుకున్నారు అనంతరం వృద్ధులకు భోజనం స్వయంగా వడ్డించి వారి ఆశీస్సులు అందు కున్నారు ఈ సందర్భంగా రసపుత్ర రజని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలు గా ప్రజానేత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి జన్మదిన సందర్భంగా వృద్ధా శ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు జన్మదినం సందర్భంగా చేసే ఆర్భాటాల కన్నా సేవా కార్యక్రమాలే ఆయనకు ఇష్టమన్నారు అందులో భాగంగా నేడు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించమన్నారు కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగలక్ష్మి నరసింహా రావు ఉప్పర మురళి చౌడం రవి ఉమామహేశ్వరి కౌన్సిలర్లు ఇర్ఫాన్ భాష కమల్‌భాష కోఆప్షన్ సభ్యులు మల్లికార్జున యాదవ్ వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రొద్దుటూరు డిసెంబర్ 20. ప్రభాతవార్త



రాష్ట్రంలో అర్హత గల ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ పరిధిలోని దొరసాని పల్లె గ్రామంలో సర్పంచ్ ఈశ్వరమ్మ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి వైసీపీ నాయకులు అరవ మునివర పాతకోట బలరామిరెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రతి గడపకు చేరుకుని ప్రజా సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు ఎమ్మెల్యే రాచమల్లు జన్మదినాన్ని పురస్కరించుకొని వైసిపి నాయకులు పాతకోట బలరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకును ఎమ్మెల్యే టచ్ చేసి అభిమానుల మధ్య సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే రాజకీయ జీవితం ప్రజా సమస్యల పరిష్కారం ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి సూచిస్తూ సిద్ధం చేసిన వీడియోలు ఆయన తిలకించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 3వ వార్డును దత్తత తీసుకుంటా : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు డిసెంబర్ 20, ప్రభాతవార్త



నా జన్మకు తల్లి కారణమైతే జీవితాన్నిచ్చింది ప్రొద్దుటూరు నియోజక వర్గం తల్లులే అని, బాల్యంలో పస్తులతో గడిపానని పేదరికమే తన కులమని ఎమ్మెల్యే రాచమల్లు శుభప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, 20న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ల జన్మదినం సందర్భంగా ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు నిమ్మకాయల సుధాకర్ రెడ్డి వీఎన్ పల్లె జడ్పిటిసి నిమ్మకాయల రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో సుమారు 1000 మంది మహిళలకు మంగళవారం ఆయన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరి ఉన్నంతవరకు జన్మ నిచ్చిన తన తల్లిని జీవితాన్నిచ్చిన నియోజకవర్గ తల్లులను మరవనని పేర్కొన్నారు రాజకీయ ప్రారంభం కౌన్సిలర్‌గా రామేశ్వరం ప్రజలు నన్ను ఆదరిస్తే ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలు ఆదరించారన్నారు మూడవ వార్డు అభివృద్ధిని ప్రజల సంక్షేమాన్ని కాంక్షించి నేటి నుండి దత్తత తీసుకుంటున్నానని హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు నిమ్మకాయల సుధాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు జింకా విజయలక్ష్మి షేట్ గురువి రెడ్డి కామిశెట్టి బాబు కౌన్సిలర్లు ఇర్ఫాన్ భాష కమాల్ బాషా పాల్గొన్నారు.

## నేడు శ్రీదేవి భూదేవి శ్రీ వేంకటేరస్వామి కల్యాణం

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పట్టనం ఉప్పరపల్లె ఆశ్రమంలో బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటరమణ స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తాదులందరూ కల్యాణ మహోత్సవంలో పాల్గొని తతీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## బీజేపీతో వర్గీకరణపై తాడోపేడో తేల్చుకుంటాం

తంబళ్లపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:



నమ్మకద్రోహి బీజేపీతో ఎస్సీ వర్గీకరణపై తాడోపేడో తేల్చుకుంటామని ఎంఎస్‌పీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కోఆర్డినేటర్ నరేంద్ర బాబు మాదిగ శపథం చేశారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఎంఎస్‌పీ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు వర్గీకరణపై మాదిగలను మోసం చేసిన బీజేపీకి వ్యతిరేకంగా మహా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున మాదిగ సోదరులు కదలి రాగా తెలుగుదేశం పార్టీ నాయ కులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ బిజెసి కర్ణాటక, తెలంగాణలో పాగా వేసినట్లు ఆంధ్రకు వస్తే మాదిగలు బీజేపీకి రాజకీయ సమాధి కడతామన్నారు. బీజేపీ నమ్మక ద్రోహానికి బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. ఈనెల 21, 22 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాదీక్షలను, 23న కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, శివారెడ్డి, నాయకులు మాజీ జడ్పీటీసీ ఈశ్వర, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిన్న, కోఇన్‌ఛార్జిలు వెంకటప్ప, తిరుపాల్, ఎంఎస్‌పీ ఇన్‌ఛార్జి వేట మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు భాస్కర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకటేష్, మల్లికార్జుననాయుడు, నాగమల్లయ్య, రాములమ్మ, జయమ్మ, ఆరు మండలాల ఎంఎస్‌పీ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బూత్‌లెవల్ కమిటీల ఎంపికకు సన్నాహాలు

పెద్దమండ్యం డిసెంబర్ 20 ప్రభాతవార్త

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపి ముందస్తు ప్రణాళికలకు రంగం సిద్ధం చేసుకుంటుంది. మంగళ వారం మండల నాయకులు, సర్పంచు లు,ఎంపిటీసీలు సమావేశమై అదిష్టానం ఆదేశాలమేరకు గ్రామ పార్టీ కమిటీల ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేయాలని నాయకులకు ఎమ్మెల్యే పిఏహేమంత్ దిశానిర్దేశం చేశారు. ప్రతి వాలంటీరుకు అదే పరిధిలోఉన్న ఇద్దరు పర్యవేక్షకులను ఏర్పాటు చేయాలని అన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలన్న ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమంను చేపట్టినట్లు తెలిపారు. ఏఒక్కరూ నిరాశకు గురికాకుండా గ్రామసర్పంచులు, నాయ కులు, ఎంపిటీసీలు, కార్యకర్తలు భాగ స్వాములై లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి, జడ్పీటీసి, సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

## గెస్టు ఫ్యాకల్టీకి దరఖాస్తులు ఆహ్వానం

పీలేరు, డిసెంబరు 20ప్రభాతవార్తః

గెస్టు ఫ్యాకల్టీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీకోర్సు కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్‌సీలో ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ అర్హత పొంది నెట్ , సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారిక ప్రాధాన్యత ఇవ్వబడును. ఈనెల 23 వతేదీలోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు 944192918 నెంబరుకు సంప్రదించాలన్నారు.

## ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి

**వెంకటేశ్వర స్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టిన వైసీపీ నాయకులు**

**బద్వేలు అర్బన్, డిసెంబరు 20 ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ముందుగా మంగళవారం ఎమ్మెల్యే డా॥ సుధ, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, ఏపి సివిల్ సప్లయ్స్ కార్పోరేషన్ డైరెక్టర్ గుర్రంపాటి సుందరరామి రెడ్డితో పాటు పలువురు వైకాపా నాయకుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా గురుకుల పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 101 టెంకాయలు కొట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వారు తెలియజేశారు. వీరికి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ బాదిరెడ్డి వెంకటరామి రెడ్డి మరియు కమిటీ సభ్యులు పలువురు నాయకులకు సాదరంగా స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం దేవాలయం ముందు సిమెంట్ రోడ్డు భూమిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డి, ఎఫ్ఆర్వో మధు బాబు, మార్కెట్ యార్డు ఛైర్మెన్ పుత్తా లక్ష్మీదేవి, వైస్ ఛైర్మెన్ నాగం సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్లు గోపాలస్వామి, సాయి కృష్ణ మరియు వైసీపీ నాయకులు బిజ్జం రమణ, అనిల్ కుమార్ రాజు, సింగసాని శివయ్య, భూమిరెడ్డి ఓబుల్ రెడ్డి, గానుగపెంట రమేష్ బాబు, శ్రీకాంత్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజా యాదవ్, బండి చెన్నయ్య, పంగా చెన్నకృష్ణారెడ్డి, యద్దారెడ్డి, రమణారెడ్డి, పుత్తా శ్రీరాములు, మౌలాలి, షఫి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బుతి చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు వర్దిరెడ్డి శివారెడ్డి, కుప్పాల రమణ, చెంచురత్నం,ఆలయ సిబ్బంది సాంబయ్య, రాజు, కొండయ్య, శివాలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ మడకల రఘురామిరెడ్డి, ఫ్రూట్స్ షఫితో పాటు పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభం దిశగా ఆంధ్రప్రదేశ్

**రాయచోటి టౌన్.డిసెంబర్ 20 ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతోందని రాయచోటి నియోజకవర్గ టీడీపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. రాయచోటి పట్టణం కొత్తపల్లిలో మంగళవారం రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధు లను నవరత్నాల పేరిట దారి మళ్లించడంతో వెనుకబడిన కులాలకు వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. అభివృద్ధి పేద వర్గాలను కాకుండా నాయ కులు దోపిడీకి అభివృద్ధి పథకాలు అంకితమయ్యాయన్నారు. తెలుగుదేశం ప్రభు త్వంలో పేద ప్రజల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌లను రద్దు అనుభవానికి వీలు కాని ఇళ్ల స్థలాలు పంపిణీ మట్టి, ఇసుక దోపిడీల దందాలతో సామాన్య ప్రజల జీవితాల్లో అల్లకల్లోలంగా మార్చాయని విమర్శించారు. ముస్లీం మైనార్టీలకు కల్లి బొల్లి మాటలు చెప్పి ఓట్లు దండుకున్న నాయకులు వారి సంక్షేమం గురించి మరిచారన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమం త్రి అయ్యి ప్రజల కష్టాలు తీరుతాయని రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడిపి రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాష, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, బోనమలఖాదర్ వలి, రమణారెడ్డి, జాబీర్, జావిద్, రామక్రిష్ణగౌడ్,లక్ష్మీరెడ్డి, రెహమాన్, అతావు ల్లా, హుస్సేన్, కలీం, మహబూబ్‌బాష, ఇలియాస్, నాయకులు పాల్గొన్నారు.







## క్రీడలతో మానసిక ఉల్లాసం

**వేంపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవచ్చుని జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టరు చంద్ర ఓబుళరెడ్డిలు అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 12 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని తెలిపారు. మొదటి బహుమతి స్వామి వివేకానంద స్కూల్ జట్టు, రెండో బహుమతి శ్రీచైతన్య హైస్కూల్ జట్టు, మూడో బహుమతి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల జట్లు విజయం సాధించాయి. గెలుపొందిన జట్టులకు జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, ఏపీఐఐసి డైరెక్టరు చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమారి, పీఈటీ రాజశేఖర్, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, పాఠశాల కమిటి ఛైర్మన్ గురుప్రసాద్, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెద్దచెప్పలిలో ఇదేం కర్మ రాష్ట్రానికి

**కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:**



కమలాపురం నియోజకవర్గం పెద్దచెప్పలి గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పెద్దఎత్తున 2వ రోజు మంగళవారం పెద్దచెప్పలి పంచాయతీ బీసీ కాలనీలో పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఇచ్చిన ఫారంను పూరిస్తూ వారి మొబైల్ నుంచి మిస్డ్‌కాల్ చేస్తూ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటు సెక్రటరీ హుసేన్‌ఖాన్, కమలాపురం నియోజకవర్గ ప్రధాన ప్రచార కార్యదర్శి వెంకట రమణ, ముదిరాజ్, కమలాపురం మండల బీసీ కార్యదర్శి వేషాద్రి పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాధరెడ్డి**

**చిన్నమండెం.డిసెంబర్ 20 ప్రభాతవార్త**



దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన సమగ్ర భూ సర్వే పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాధరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వండాడి గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం కింద పూర్తి చేసుకున్న రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికలతో సమగ్ర సర్వేని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతోందన్నారు. వండాడి గ్రామ సచివాలయ పరిధిలో 520 హక్కు పత్రాలును రైతులకు అందజేశామని, మరిన్ని రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపిడివో దివ్య, రిసర్వే డీటి అజార్ అలీఖాన్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు నాయక్, భూషణ్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, దనుష్‌కుమార్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కొండారెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజారెడ్డి, చోటుబచ్చా, సచివాలయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటలో టిబి సెంటర్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డిఎంహెచ్ఓ

**రాజంపేట అర్బన్, డిసెంబరు 20 ప్రభాతవార్త**

రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో టిబి సెంటర్‌ను జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ శైలజా మంగళ వారం పరిశీలించారు. కార్యాలయంలో టిబి రోగుల రికా ర్డులను పరిశీలించారు. అనంతరం ఎయిడ్స్ సెంటర్‌ను, లెప్రసి వార్డును తనిఖీ చేశారు. ఈడిగపాలెం హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి లెప్రసి సర్వేపై నివేదికలను పరిశీలించారు. ఉస్మాన్‌నగర్‌లో కొన్ని ఇళ్లను ర్యాండమ్ గా పరిశీలించారు. లెప్రసి సర్వే సంతృప్తికరంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జు న, డాక్టర్ అశోక్, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

**వేంపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



మొక్కలు నాటి సంరక్షిస్తేనే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం వేంపల్లెలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో డిప్యూటి ఫారెస్టు రేంజి అధికారి గుర్రప్ప ఆధ్వర్యంలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, మార్కెట్ కమిటి డైరెక్టరు రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ యోగాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ ముందస్తు జన్మదిన వేడుకలు

**వేంపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను వేంపల్లె మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సీఎం జగన్ పుట్టి నరోజు సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. చిన్నారులకు కేకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు ముందస్తు వేడుకల్లో భాగంగా చిన్నారుల మధ్య కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, అధ్యక్షుడు కావలి క్రిష్ణతేజ, ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి, రంగారెడ్డి, డాక్టర్ రంగయ్య, చల్లా బాలాజి, రామ్‌మనోహర్, శ్రీకళ, గోవర్దన్, సమీర్, మదార్‌షావలి,శ్రావణ్‌కుమార్, గోపీ, పవన్, పాల్గొన్నారు.

## మా కంటి వెలుగు ముక్కా రూపానందరెడ్డి

**చిట్వేలి, డిసెంబరు 20 ప్రభాతవార్త**



మా కంటి వెలుగు ముక్కా ట్రస్టు అధినేత రూపానందరెడ్డి అని చిట్వేలి మండల పరిధిలో గత నెలలో ముక్కా ట్రస్టుచే 100 మందికి పైగా కంటి ఆపరేషన్ చేయించుకుని లబ్ది పొందినవారు పేర్కొన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ, ముక్కా సాయివికాస్‌రెడ్డి సతీమణి శిరీషల ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారందరికి వైద్యులచే కంటి పరీక్షలు చేయించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరవ శ్రీధర్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, పిఇటి దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**-డిఎస్పీ శ్రీధర్ పిలుపు**

**రాయచోటి టౌన్.డిసెంబర్ 20 ప్రభాతవార్త**



విద్యుత్ పొదుపు ప్రజలందరి సామాజిక బాధ్యతగా తీసుకోవాలని డిఎస్పీ శ్రీధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం విద్యుత్ కార్యాలయం నుంచి మంగళవారం జాతీయ విద్యుత్ వారోత్సవాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను ప్రతి ఒక్కరు పొదుపుగా వాడుకొని కరెంట్ చార్జీలు పొదుపు చేయాలని ఆయన కోరారు. కొందరు ఇష్టానుసారంగా కరెంట్ వాడకం వల్ల కరెంట్ బిల్లులు అధికంగా రావడం జరుగుతోందన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రజలందరూ సహకరించి పొదుపుగా కరెంట్ వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్‌బాష ప్రసంగించారు. అనంతరం ర్యాలీ శివాలయం సర్కిల్ నుంచి ఎస్ఎన్ కాలనీ, నేతాజి సర్కిల్ మీదుగా బస్టాండు కూడలి వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో డీఈఈ లు తిరుపాల్ నాయక్, చిన్నస్వామినాయక్, ఏఈలు నరేంద్రనాద్‌రెడ్డి, పీరాన్‌సాహెబ్, నాగరాజు, నరేష్‌కుమార్, ఏఏవో పాపయ్య, ఓయన్‌యం మరియు అకౌంట్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర నమ్మకద్రోహం దినంగా ప్రకటించాలి

**వేంపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు డిసెంబరు 21వ తేదీన రాష్ట్ర నమ్మకద్రోహ దినంగా ప్రకటించాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల, అన్నివర్గాల, అన్నిరంగాల ప్రజలను సీఎం జగన్ నమ్మించి మోసగించారని తులసిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.12500 ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక రూ.5వేలు కోత పెట్టారన్నారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు కల్పిస్తామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శీతల గిడ్డంగి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని నమ్మించారన్నారు. ప్రత్యేకహోదా సాధించి ఉద్యోగాల విప్లవం తీసుకువస్తాం, ఖాళీగా ఉన్న 2.3లక్షల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం, ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో చెప్పి అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మద్యనిషేధం, 25లక్షల ఇళ్ల నిర్మాణం, జలయజ్ఞం, తదితర హామీలు నెరవేర్చలేదన్నారు. ఇలాంటి పలు కారణాల దృష్ట్యా డిసెంబరు 21వ తేదీని నమ్మకద్రోహ దినంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కడప వైద్య విభాగం, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

కడప నగరంలోని పాస్టర్స్ క్రైస్తవ విశ్వాసుల మధ్య కలెక్టరేట్ భవనంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన హైటీ క్రిస్మస్ ప్రోగ్రాం జిల్లా జేసీ సాయికాంత్‌వర్మ, క్రిస్టియన్ మైనార్టీ అధికారులు కృష్ణకిశోర్, సూపరింటెండెంట్ మధుసూదన్, జూనియర్ అసిస్టెంట్ కరీముల్లా, రియాజ్, మస్తాన్, సీనియర్ అసిస్టెంట్ దేవిడ్‌లు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్మస్ తాత దుస్తులతో శాంతిరాజు, దేవదూత వస్త్రాలతో రోజా అందరికీ స్వీట్లు పంచుతూ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో కృపా కాలనీకి చెందిన న్యూ నేటీవ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ మహేష్, ఫాదర్ అబ్రహాం, షద్రక్, బిషప్ దానియేల్, విజయ భాస్కర్, జిల్లాలోని క్రైస్తవ విశ్వాసులు అనేక మంది పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎగువగొట్టివీడు విద్యార్థిని

**గాలివీడు.డిసెంబర్ 20 ప్రభాతవార్త**



రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో కె.శ్రావణి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపి కయినట్లు ప్రధా =నోపాద్యాయులు బి.విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏజిఎఫ్ఐ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ఫస్ట్ స్టాండ్ బైగా ఎంపిక యిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన పోటీల్లో ప్రధమ స్థానంలో నిలిచిన శ్రావణి త్రోబాల్ చాంపియన్‌గా నిలవడం గర్వకారణమన్నారు. అనంతరం హెడ్‌మాస్టర్, ఉపాధ్యయ బృందం విద్యార్థిని శ్రావణిని అభినందించారు.

## బిసి బాలుర వసతి గృహం పరిశీలించిన జిల్లా అధికారి

**వీరబల్లి.డిసెంబర్ 20 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ బీసి బాలుర వసతి గృహంను మంగళవారం అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ అధికారి సందప్ప తనిఖీ చేశారు. సంబందిత రికార్డులను పరిశీలించారు. స్టోర్ రూములు, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలన్నారు. లేదంటే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో సీఎం పుట్టినరోజు వేడుకలు

**పులివెందుల, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందస్తు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేశారు. అలాగే సర్వమత ప్రార్థనలు చేశారు. పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటి అధ్యక్షుడు గోటూరు చిన్నప్ప కళాశాలకు నాలుగు బీరువాలు, రెండు ఆఫీస్ టేబుల్స్ వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తొండూరు మండల వైకాపా ఇన్‌ఛార్జి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు.

## మొక్కలు నాటిన మేడా, ఆకేపాటి

**రాజంపేట అర్బన్, డిసెంబరు 20 ప్రభాతవార్త**

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు మొక్కలను నాటారు.కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైకాపా నేతలు నల్లబోతుల ఈశ్వరయ్య,మనుబోలువెంకటేశ్వర్లు,సత్యాల రామక్రిష్ణ, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



















